క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌లో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఎంకామ్, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లీష్‌లలో ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు పీజీ కోఆర్డినేటర్ చంద్రకాంత్ 99496 85090ను సంప్రదించాలని సూచించారు.

కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు యువసేన మండల కార్యవర్గాన్ని బుధవారం జిల్లా అధ్యక్షుడు అక్కెపెల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. యువసేన మండల అధ్యక్షుడిగా సాధిక్, ఉపాధ్యక్షుడిగా గంగయ్య, సభ్యులుగా పాముల ప్రవీణ్‌కుమార్, రఫీక్, ఖదీర్, అశోక్, భూమయ్య, రామారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

జైఆదివాసీ యువశక్తి..

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో జై ఆదివాసీ యువశక్తి కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు బిపిన్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సుధాం, ఉపాధ్యక్షుడిగా నాగోరావ్, ప్రధాన కార్యదర్శి సంతోష్, సంయుక్త కార్యదర్శులు ప్రకాష్, లక్ష్మణ్, రవీందర్, పాండురంగ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డీ ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి మెస్రం ప్రకాష్, శంకర్ పాల్గొన్నారు.

10న చాకలి ఐలమ్మ వర్ధంతి

కైలాస్‌నగర్: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఈనెల 10న నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు రిమ్స్ ఆసుపత్రి ఎదుట నిర్వహించే కార్యక్రమానికి రజక కులస్తులు, బీసీ సంఘాల నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేషన్‌షాపు ప్రారంభం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం 170 సర్వే నెంబర్ కాలనీలోని ఆదిత్యనగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్‌షాపును మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ బుధవారం ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసి కార్డుదారులకు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో డీలర్ ఏర సుధాకర్, నల్ల రాజేశ్వర్, సుధీర్, అజీమ్ పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే అలరించింది. డీజే పాటలకు విద్యార్థినులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ జాదవ్ గణేష్‌కుమార్ మాట్లాడుతూ.. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు భయం, బిడియం పోగొట్టేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కళాశాల అధ్యాపకులు ప్రభాకర్‌రెడ్డి, గోవర్ధన్, బాలాజీ, సోమన్న, నాగభూషనం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనిల్‌జాదవ్ పర్యటన

బోథ్: బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ బుధవారం ధన్నూర్, ధన్నూర్(కె), బిర్లాగొంది, రఘునాథ్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు. మీ బిడ్డగా వస్తున్నా.. ఆశీర్వదించాలని కోరారు. రఘునాథ్‌పూర్ గ్రామంలో పవార్ భీమబాయి ఇటీవల మృతి చెందడంతో వారి కుమారులు అనాథలుగా మారడంతో వారికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతం రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, శ్రీధర్ రెడ్డి, తిరుమల్ గౌడ్ పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

ఎదులాపురం: తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల త్యాగం చిరస్మరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ఈనెల 11 నుంచి 16వరకు సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ జెండాలు ఎగరవేయాలని, అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. నళినీరెడ్డి, అరుణ్ కుమార్, బుర్రి సత్యాజీ, అమీనా బేగం, పాచ్చిరాం, మహబూబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నేరడిగొండ: విద్యుత్ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఆన్ మ్యాండ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో దేవాదాయ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పాండు, కోశాధికారి గంగన్న, ఉపాధ్యక్షుడు ఇబ్రహీం, జాయింట్ సెక్రటరీ బాపురావు, ఫిరోజ్, శంకర్, ఆనంద్ పాల్గొన్నారు.


ఆదిలాబాద్: చిన్నికృష్ణుల వేషధారణలో చిన్నారులు


తాంసి: కప్పర్ల పాఠశాలలో..


బోథ్: ఊయల ఊగుతున్న చిన్నారులు


ఉట్నూర్‌రూరల్: చిన్నారుల సందడి


నేరడిగొండ: మట్టి, నీరు సేకరించేందుకు వెళ్తున్న మహిళలు

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల గోపిక, కృష్ణుల వేషధారణ ఆకట్టుకుంది. శ్రీ క్రిష్ణ నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నేరడిగొండ మథురనగర్ కాలనీలో మథుర లబానా కులస్తులు కృష్ణుని విగ్రహ ప్రతిష్ఠాపన కోసం నీరు, మట్టి తీసుకువచ్చేందుకు సమీప బావి దగ్గరికి వెళ్లారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


తాంసి: వేషధారణలో చిన్నారులు


బజార్‌హత్నూర్: కృష్ణుడి వేషంలో చిన్నారి


జైనథ్: చిన్ని కృష్ణులతో అంగన్‌వాడీ టీచర్లు


బేలలో..


తాంసి: ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు


బోథ్: గుర్రాలతండాలో..

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల మానవహారం

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కరించాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజుకు చేరింది. ఇందులో భాగంగా కలెక్టరేట్ నుంచి కుమురంభీం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు మానవహారంగా ఏర్పడి సర్కారు తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును కలిశారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి సమస్యలు విన్నవించారు. నాయకులు ప్రవీణ్, సోహెల్, గీతేష్, రమణ, దత్తు, చిరంజీవి, అనిల్, వందన, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిల్కూరి జ్యోతిరెడ్డి బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాదులోని రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఇచ్చోడ: కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి అన్నారు. బుధవారం మండలంలో నర్సాపూర్‌లో అంగన్‌వాడీల సెక్టార్ సమావేశం నిర్వహించారు. బాలికలు పౌష్టికాహారం, ఐరన్, పోలిక్‌యాసిడ్ మాత్రలపై అవగాహన కల్పించారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: తల్లులకు, యుక్త వయస్సు పిల్లలకి పౌష్టికాహారం చాలా ముఖ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులత అన్నారు. బుధవారం పట్టణ కేంద్రలలోని శాంతినగర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ కార్యక్రమం నిర్వహించారు. మనం రోజు తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, పండ్లు, పప్పు ధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మీణ కుమారి, ముక్తా, మీరాబాయి, నాగదివ్య పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని పెద్దబుగ్గారం, వడూర్ గ్రామాల్లో పోషణ మాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ.. పోషణ అభియాన్‌లో భాగంగా చేపడుతున్న పలు కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. మహిళలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. సర్పంచ్‌లు జాదవ్ రేణుక బాయి, గాదె సమత, అంగన్‌వాడీ టీచర్స్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నాయకులను నమ్మవద్దు

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల సమయంలో వచ్చే ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మవద్దని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు, కాలనీవాసులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్నిపార్టీల నాయకులు ప్రజల వద్దకు వస్తారని, వారిని నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ఆలస్యం జరుగుతుందన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, అజయ్, అంజుమ్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి భూమిపూజ..

ఆదిలాబాద్ పట్టణంలోని శంకర్‌గుట్టలో నిర్మించన్న వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే జోగు రామన్న ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పనుల నిమిత్తం రూ.5 లక్షలు మంజూరు చేశామని, అవసరమైతే అదనపు నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రఘుపతి, అశోక్ స్వామి, మెట్టు ప్రహ్లాద్, ధమ్మపాల్, రాజు, కరుణ పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

అక్రమ రవాణా నిరోధించడం అందరి బాధ్యత

ఆదిలాబాద్‌టౌన్: మానవ అక్రమ రవాణా నిరోధించడం అందరి బాధ్యత అని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బలరాంకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ రవాణ, వ్యభిచారానికి వ్యతిరేకంగా సంస్థ ఉద్యమిస్తుందన్నారు. మహిళ శిశు సంక్షేమ, పోలీసు, న్యాయ, విద్యాశాఖ సమన్వయంతో ఇప్పటివరకు 28,200 మంది యువతులను కాపాడినట్లు పేర్కొన్నారు. అక్రమ రవాణాకు సంబంధించిన చట్టాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మహిళలు ఇబ్బందులకు గురైతే 1098, డయల్ 100, 181, 108, 1930, సఖీ, 161 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. మహిళలు, యువతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సురేష్ కుమార్, శివకుమార్, రూపావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఇంద్రవెల్లి: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ప్రవీణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కోరెంగా గాంధారి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఇప్పటి వరకు ఓటు హక్కును నమోదు చేసుకోనివారు అంగన్‌వాడీ, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోష్, సంజీవ్‌రావు పాల్గొన్నారు.

ఇచ్చోడ: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ తుకారాం అన్నారు. జిల్లా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం కమిషన్ జారీ చేసిన టీ షర్టులు ధరించి కార్యాలయానికి హాజరయ్యారు. ఓటుహక్కు నమోదు కోసం బీఎల్‌వోలను సంప్రదించాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఓటుహక్కు నమోదుకు ఈనెల 19 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఉట్నూర్ ఆర్డీవో జీవారెడ్డి సూచించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. బూత్ ఏజెంట్లు సహకరించి ఎవరికైతే ఓటుహక్కు లేదో నమోదు గురించి వివరించాలన్నారు. సమావేశంలో నాయకులు ధరణి రాజేశ్, ముజీబ్ ఖాన్, జుబేర్ ఖార్, అబ్రార్, అహ్మద్, సుమన్, ఖదీర్ పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి: అవగాహన కల్పిస్తున్న అధికారులు

‘బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే అభివృద్ధి’

కైలాస్‌నగర్: బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మహాలక్ష్మివాడ కాలనీకి చెందిన పలువురు మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆడబిడ్డల కష్టాలను తొలగించేందుకు కుక్కర్లు పంచుతుంటే అడ్డుకునే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. జోగు రామన్న పనితీరుపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓటమి ఖాయమన్నారు. ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.


పార్టీలో చేరిన మహిళలతో కంది శ్రీనివాసరెడ్డి

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

ఆదిలాబాద్: రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జైనథ్ మండలం కౌట గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. రాష్ట్రంలోని అన్నివర్గాలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలందరికీ ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ నిధులు కేంద్రానివే

బోథ్: ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా పటాన్‌చెరువు వరకు నిర్మించే రైల్వేలైన్‌ను అవసరమయ్యే నిధులు కేంద్ర ప్రభుత్వానివేనని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజుయాదవ్ అన్నారు. బుధవారం ఆయన నివాసంలో నాయకులతో కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వల్లే వచ్చిందని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడుగు అశోక్ రెడ్డి, చాబంతుల కృష్ణ, రమేశ్, వెండి సోమేశ్వర్ పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

ఇంద్రవెల్లి: రైతు ఉత్పదక సంస్థను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని నాబార్డు సీజీఎం సుశీల చింతల అన్నారు. బుధవారం మండలంలోని ఐఎఫ్‌పీసీఎల్ (రైతు ఉత్పదక)సంస్థను సందర్శించారు. సంస్థ నిర్వాహకులు, రైతులతో కలిసి జిన్నింగ్ మిల్లును పరిశీలించారు. సభ్యత్వం తీసుకున్న రైతుల వివరాలు, జిన్నింగ్ మిల్లు పని తీరు, సంస్థకు వచ్చే ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాబార్డు డీజీఎం శ్రీనివాస్, ఆదిలాబాద్ డీడీఎం అబ్దుల్, రాథోడ్ నిలేష్, సీఈవో కమలాకర్, పెందోర్ భగవంత్‌రావ్ పాల్గొన్నారు.

వారసంత అభివృద్ధికి నాబార్డు చేయూత

బేల: వారసంత అభివృద్ధికి నాబార్డు తరపున రూ.15 లక్షలు అందిస్తున్నామని రాష్ట్ర నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వారసంతలో గ్రామ పంచాయతీ పదిశాతం వాటాతో కలిపి రూ.16.50 లక్షల వ్యయంతో రెండు షెడ్లు, ఒక గోదాం, మరుగుదొడ్ల నిర్మాణానికి సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్రశేఖర్‌తో కలిసి భూమిపూజ చేశారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కిష్టారెడ్డి, జక్కుల మధుకర్, తాక్రే గంభీర్, సతీష్‌పవార్, అకాష్ పాల్గొన్నారు.

సమాచారం

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన షేక్ రఫీక్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ రాథోడ్ సజన్, మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి బాధితుడికి చెక్కు అందజేశారు.

దేశ సేవకు ఎంపిక కావడం గర్వకారణం

ఆదిలాబాద్‌టౌన్: తమ కళాశాలకు చెందిన విద్యార్థి దేశ సేవ చేసేందుకు ఎంపిక కావడం గర్వంగా ఉందని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత అన్నారు. విద్యార్థి ఉల్లాస్ బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో ఉద్యోగం సాధించడంతో బుధవారం సన్మానించారు.

ఇల్లు పరిశీలన

జైనథ్: మండల కేంద్రానికి చెందిన ముక్కెర ఊశన్న ఇల్లు వర్షానికి ధ్వంసమైంది. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఇంటి గోడలు కూలిపోయాయి. ఆర్ఐ నితిన్ సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

53వ రోజుకు చేరిన దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా చేయాలని చేస్తున్న దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 53వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో దివ్యాంగుల సంఘం సభ్యులు కూర్చున్నారు. ఎన్నికల లోపు బోథ్‌ను డివిజన్ చేయాలని డిమాండ్ చేశారు.

పశువులకు టీకాలు వేయించాలి

ఉట్నూర్‌రూరల్: రైతులు, పశుపోషకులు తమ పశువులకు టీకాలు వేయించాలని ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు అన్నారు. మండలంలో ఘన్‌పూర్‌లో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో టీకాల కార్యక్రమం నిర్వహించారు. పాడి పశువులకు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

ఇచ్చోడ: ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఇచ్చోడ ప్రాథమి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. బుధవారం మండలంలోని కోకస్‌మన్నూర్ ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి, పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం తులిసి, అహల్య, ఆశ కార్యకర్త గిరిజ పాల్గొన్నారు.

సింహగర్జన విజయవంతం చేయండి

ఎదులాపురం: హైదరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో ఈనెల 10న నిర్వహించే బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వాల్ పోస్టర్ విడుదల చేశారు.

హెచ్ఎంపై చేసిన ఆరోపణలు అవాస్తవం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని చించుఘాట్ గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణపై గత రెండు రోజుల కిందట గ్రామస్తులు చేసిన ఆరోపణలు అవాస్తవమని ఆల్ ఇండియా ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. సదరు ఎస్‌సీఈఆర్‌పీపై చర్యలు తీసుకోకుండా హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు.

మహిళల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం

నార్నూర్: మహిళల సంక్షేమం, అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, బీసీబంధు చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, యునుస్ అక్బాని, తహసీల్దార్ రాజలింగం, ఎంపీడీవో రమేశ్ పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్‌రూరల్: దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. బుధవారం మండలంలోని గంగాపూరలో గ్రామస్తులు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీచైర్మన్ మాట్లాడుతూ.. ఆత్మీయ సన్మానం చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సర్పంచ్ దుర్వా రేణుకాబాయి, సలీమొద్దిన్, ప్రజ్ఞశీల్, రాజేశ్వర్, స్వామి, కామాజి, దావుల రమేశ్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ

బోథ్: మండలంలోని ధన్నూర్(బి)లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని బుధవారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్, ఎంపీపీ తుల శ్రీనివాస్‌లు ఆవిష్కరించారు.

కౌలు రైతుల సదస్సుకు తరలిరండి

బోథ్: హైదరాబాద్‌లో ఈనెల 12న నిర్వహించనున్న కౌలు రైతు సదస్సును విజయవంతం చే యాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న కోరారు. మండలంలోని కనుగుట్ట, కౌఠ, ధన్నూర్ గ్రామాల్లో రైతులతో బుధవారం ఆయన సమావేశం అయ్యారు. ఇందులో రైతులు భీమ రాజు, అశోక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంబురాలు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం పంచాయతీ తకార్యదర్శులను రెగ్యులర్ చేయడం పట్ల ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు బుధవారం సంబురాలు జరుపుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జైవంత్‌రావు కార్యదర్శులకు స్వీట్లు తినిపించారు. జీపీ కార్యక్రమాలు, పారిశుధ్రత ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు.